# మమత



మహీధర రామశాస్త్రి

పరంధామయ్య పడక్కుర్చీలో కూర్చుని, పత్రికలో కథ దీక్షగ చదువుతున్నాడు. అలా పత్రికలు చదువుకుంటూ, హాయిగ కాలం గడిపేసేటంత అదృష్టవంతుడేం కాదు, పరంధామయ్య. మేనల్లుడు కిష్టప్ప కథ పత్రికలో కనిపించింది. అందుకని కుతూహలంగా చదువు తున్నాడు.

కథ చదివి ఓ నిట్టూర్పు విడిచి, అలా ఆకాశం అంచుల్లోకి చూపులు మరల్చాడు, పరంధామయ్య. తన యింటి ముందు, నిత్తుగ వీరకంకర రోడ్డు. రోడ్డవతల పెద్ద కాలవ. తరవాత యింకా నిత్తుగా ఏటిగట్టు. ఆ వెనక విశాలంగ లంక ఆ తరువాయి వెడల్పైన గోదావరి పాయ గోదావరి పాయపై ఎగురుతున్న పక్షుల ఆకాశంలో అందంగ అగుపిస్తున్నాయి.

పదేళ్ళక్రితం భార్యని, ఆ లంకలోనే బూడిదచేసి గోదావరిలో కలిపాడు. ఆ దిక్కుగ ఆకాశం ఎర్రబడి, సూర్యాస్త మయం అవుతూంటే, భార్య చితిమంటలు గుర్తుకు వస్తాయి పరంధామయ్యకి – సాయంత్రాలు అలా ఓ అయిదు నిముషాలు సూర్యాస్తమయాన్ని చూస్తూ గడపందే తోచదు. అలా కాని రోజున, భార్య ఆత్మకి పెద్ద ద్రోహం చేసినట్టు మథన పడతాడు పరంధామయ్య. అదే అతని సంధ్యా వందనం.

కిష్టప్ప కథ బుర్రలో తిరుగుతూంది. రవి, సుజాత ప్రేమికులు. రవి నిరుద్యోగి; సుజాత ఉద్యోగిని. భర్త ఉద్యోగం చేస్తూ, ఉద్యోగి కాని భార్యని గౌరవంగ ప్రేమిస్తున్నపుడు, భార్య ఉద్యోగం చేస్తూ, ఉద్యోగి కాని భర్తని గౌరవంగ ప్రేమించ వచ్చుగదా ? అన్న అంశం మీద, బాగ చర్చించుకుని, యిద్దరి సమస్యలనీ ఓ కొలిక్కి తెచ్చుకుని, పదవగాహనతో పెళ్ళికి సిద్ధపడతారు.

పరంధామయ్య కథ ద్వారా గ్రహించింది కిష్టప్ప మనసు. తన కూతురు సుజాత టీచరు ట్రైనింగు పాసయి వుంది. రేపో మాపో ఉద్యోగం రావచ్చు ఉద్యోగం వచ్చాక పెళ్ళి చేయాలన్నది తన కోరిక. మేనల్లుడు కిష్టప్ప బి. ఏ పాసయి ఖాళీగ వున్నాడు. ఈడయినవాడే! "బహుశా తన కోర్కెని యీ విధంగ కథ ద్వారా, కిష్టప్ప సూచించలేదు కదా?" అని ఆలోచిస్తున్నాడు, పరంధామయ్య.

లోపల వంటింట్లోంచి, రెండో కూతురు చేస్తున్న వంట ఘాటు వాసనలు బయట పడుతున్నాయి.

సుజాత తల వంచుకుని, వడుచుకుంటూ వస్తూంది. సాయంత్రం నాలుగు నుంచి, ఈపాటివేళ వరకూ, ప్రెసిడెంటు గోపాల రాజుగారి యింట్లో పిల్లలకి పాఠాలు చెబుతుంది.

గోపాలరాజు అభిమానం తనకి కొండంత బలం. రాజకీయ బలం గట్టిగ వున్న గోపాల రాజు సుజాతకి టీచరుగ ఉద్యోగం వేయించ గలడన్నది తన విశ్వాసం.

అతను పాలేళ్ళతో, లంకలోనే వుంటాడు రోజల్లా. చీకటి పడ్డాక యిల్లు చేరుతాడు. వస్తూనే భోజనం చేసి, అరుగుమీదకు చేరి, వాలుకుర్చీలో కూర్చుని, లంక పొగాకు పాయలు విడదీసుకుంటూ, ఈనెలు అరుగు క్రిందకి విసిరి పారేస్తూ, తాపుగ, పొడుగ్గ చుట్టచుట్టి కాల్చుకుంటాడు. అరుగుమీదకి చేరిన మనుషులతో కబుర్లు చెబుతూ, రాజులాగే బ్రతుకుతాడు గోపాలరాజు. అంత మందిలో వెళ్ళి అడగడానికి చిన్నతనంగ వుంది తనకి. లంకలో వుండగా కలుసుకుని




74 సం.గా అఖండ ఖ్యాతిగాంచిన
నారసింహలేహ్యం
రిజిష్టర్డు ట్రేడ్‌మార్కు
అన్ని రకములైన (ముఖ్యముగా పురుషుల) బలహీనతలను పోగొట్టి రక్త వృద్ధిని, పుష్టిని కలిగించు వాజీకరము.
1 డబ్బా రు. 7—25 పోస్టేజి ప్రత్యేకము.
పి. సి. ఏ. అండ్ కో.,
పెందేపి 523273 [ప్రకాశం జిల్లా]
క్యాటాగు ఉచితము. కోరినవారికి ఏజన్సీలు ఇవ్వబడును.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!

# మ మ త

మాట్లాడాలని అనుకుంటున్నాడు కాని ఆ పని మాత్రం జరగడం లేదు.

సుజాత గుమ్మం ఎక్కుతూ ఉంటే, పరీక్షగ చూశాడు "బాగా ఎదిగి పోయింది. ఈ వయసుకి తన భార్య కాపరానికి వచ్చేసింది!" అనుకున్నాడు.

సుజాత కూజాబిందె తీసుకుని, కాలవ రేవులోకి వెళ్ళింది. రెండు బిందెలు మంచి నీళ్ళు చేరవేశాక, కూతుర్ని పిలిచాడు పరంధామయ్య.

పడక్కుర్చీ పక్కనే, చాపమీద కుదురుగ కూర్చుంది. భోజనాల వేళ వరకూ తండ్రికి తనతో, చెల్లెలితో కబుర్లు చెప్పడం అలవాటే. కుటుంబ స్థితీ, సమస్యలూ, తల్లి జ్ఞాపకాలూ, గ్రామ విశేషాలు సాధారణంగ దొర్లుతాయి ఆ కబుర్లలో. గోపాలరాజు గురించి మాట్లాడుతూ అతను అంటూ వుంటాడు తరుచు.

"ఏదయిన ఉపకారం చెయ్యాలంటే రాజులకే చెల్లింది. వాళ్ళకా సమర్థతా వుంది; సహృదయతా వుంది. నీతో వుందయ్యా అంటే చాలు! చేస్తానని మాటయిస్తే, యిచ్చినమాట నిలుపుకునే తత్వం అతనిది. ఉదాత్తమైన వ్యక్తిత్వం, రాజ ఠీవి గల మనిషి గోపాలరాజు!"

ఆలోచిస్తూ కూర్చున్న సుజాతని పరంధామయ్య ప్రశ్నించాడు.

"అమ్మా! సుజాతా! మీ బావ కథ పడింది, చదివావా?"

"చదివాను, నాన్నా!" అని వూరుకుంది

"కథలో సుజాత సూచన గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"సుజాత సూచన బాగానే వుంది. కాని ఆ సూచన ఏంతవరకు ఆచరణ సాధ్యం అన్న దానికి, కథలో సమాధానం చెప్పలేదు. ఆడది ఉద్యోగం చేసి పోషిస్తానంటే, సరేనని సయ్యని సిద్ధపడే మగాళ్ళెంత మంది? సంసారంలో వాళ్ళ సఖ్యత ఏంత వరకు సుఖ శాంతులతో ఉంటుంది? అన్నది మనం చెప్పలేం!"

"బావ తన అభిప్రాయాన్ని, యీ కథ ద్వారా సూచించాడేమో అనిపిస్తుందమ్మా నాకు!"

"కావచ్చు!"

"అదే బావ అభిప్రాయం అయితే నీ వుద్దేశ్యం ఏమిటి?"

"బావ అభిప్రాయానికీ, నా వుద్దేశ్యానికి సంబంధం ఏమిటి?"

"అదేనమ్మా, నీకు ఉద్యోగం వచ్చాక ఒకవేళ తనకి నిన్ను పెళ్ళాడ్డానికి అభ్యంతరం లేకపోతే, నీ వుద్దేశ్యం ఏమిటి? అంటున్నా!"

అయిదు నిముషాలు మౌనంగా వుండి పోయింది సుజాత.

ఆ నిశ్శబ్దంలో సుజాత మనస్సును అంచనా వేసుకున్నాడు పరంధామయ్య.

"ఉద్యోగం లేందే మగాడికి పెళ్ళాడ్డానికి అర్హత లేదని నా వుద్దేశ్యం. బావకి ఉద్యోగం లేదు ఆస్తి పాస్తులు లేవు. కనీసం వుండడానికి ఓ యిల్లన్నా లేదు. తండ్రి తన చిన్నతనంలో పోగా, తల్లీ తనూ పల్లెటూళ్ళో ఎలా బతుకుతున్నారో భగవంతుడికే తెలియాలి! అటువంటి వాణ్ణి కట్టుకోవడం నా కిష్టం లేదు!"

పరంధామయ్య అంచనా తల్లక్రిందు లయింది.

"బావకేమమ్మా? డిగ్రీ వుంది. మంచి భావుకుడు. ఈవేళ కాకపోతే రేపయిన పైకి రాగలడు— ఉద్యోగమే కావాలా? నిన్ను పిల్లల్ని పోషించక పోలేదు. నీకెలాగు ఉద్యోగం వుంటుంది. ఇద్దరూ అన్యోన్యంగ గడిపెయ్యొచ్చు గదా?"

తల పంకించి ఊరుకుంది సుజాత.

పమిటకొంగుని చేతులు తుడుచుకుంటూ వచ్చి, తండ్రిని అక్కని లోపలకి భోజనాలకి పిలిచింది, ప్రమీల.

## 2

"నాన్నకి మరికాస్త తగ్గే వరకూ ఉండండి అత్తయ్యా!" అంటూ కోరారు సుజాత, ప్రమీల.

వాళ్ళలా కోరిన మీదట, కాదనలేక మరో నాలుగురోజులు ఉండడానికే నిర్ణయించుకున్నారు, కిష్టప్ప-తల్లీ.

పరంధామయ్య మూడు పథ్యాలుతిని లేచి, కాస్త మాట్లాడగలుగుతున్నాడు. కిష్టప్ప, తల్లి తెల్లవారితే వెడతారనగ, పరంధామయ్య తీసుకు రావాల్సిన ప్రసక్తే తీసుకు వచ్చాడు.

పిల్లలు యిద్దరూ యిష్టపడి చేసుకుంటే, తనకేం కావాలంది కిష్టప్ప తల్లి.

ముఖ్యంగ సుజాత, కిష్టప్ప చర్చించు

కుని నిర్ణయించుకుంటే బాగుంటుందని పించింది, ఆ యిద్దరికీ.

మామూలుగ పాఠాలు చెప్పడం కోసం వెళ్ళి, సాయంత్రం గోపాలరాజు యింటి నుంచి తిరిగి వచ్చిన సుజాత ఆ రోజు హుషారుగ వచ్చింది. అందరూ కూర్చున్న ఆ సమయంలో సుజాత శుభవార్త వెల్లడించింది

"మన వూళ్ళో స్కూల్లో రిటైర్మెంటు వేకెన్సీలోకి నన్ను వేయించబోతున్నట్లు గోపాలరాజుగారు చెప్పారు ఈ నెలాఖరుకి రిటైరుమెంటు ఉంది తిరిగి బడి తెరిచేసరికి నేను జాయిను కావచ్చు. మన ఊళ్ళోనే పనిచేయడం, మన అదృష్టం, ఆయన మంచితనం!" అని వివరించింది.

పరంధామయ్య సంతోషించాడు-కిష్టప్ప సంతోషించినా, గోపాలరాజు మాట రాగానే ముఖం ముడిచాడు. గోపాలరాజు ఏ విధంగా రాజకీయంగ బలపడుతున్నదీ గ్రహించాడు. అధికార యంత్రాంగాన్ని తన రాజకీయాలకి ఎలా వాడుకుంటున్నదీ పసిగట్టాడు. అంచేత, సంతోషం, బాధ మిళితమై మౌనంగ వుండిపోయాడు.

కిష్టప్ప మౌనాన్ని సుజాత శంకించింది. పరంధామయ్య అర్థం చేసుకోగలిగాడు. ప్రమీల ప్రమోదం ప్రకటించింది.

కిష్టప్ప తల్లి "బావుందమ్మా! బావుంది!" అంది.

ఆ రాత్రి భోజనాలయ్యాక, తీరికగ కూర్చున్న సమయాన నీలాకాశం మీద చంద్రుడు విహరిస్తూ, కాలవ నీటికి వెండి కాంతులు పూస్తున్నవేళ, సుజాత-కిష్టప్ప కష్ట సుఖాలు చెప్పుకుంటున్నట్లు సంభాషణ ప్రారంభించారు.

"సుజాతా! మావయ్య పెద్దవాడయి పోయాడు. నీకు ఉద్యోగం అయింది కనుక, అతన్ని పద్దులకీ, తోటలకీ వెళ్ళనీయకు. ఇంటి పట్టున ఉంచి, జాగ్రత్తగ చూసుకోండి!"

"మా ఉద్దేశ్యం అదే. కానయితే అతను వింటాడనా? కాస్త పుష్టి చేకూరిందంటే కాళీగా కొట్టుమీద కూర్చోవాలి అని తోటలకి దింపులకి అనీ వెళ్ళకుండ వుంటే అంతే చాలు!"

"ప్రమీలనేం చేద్దామని నీ ఉద్దేశ్యం?"

"అది మిషను కుట్టడం నేర్చుకుంటోంది డిప్లమా చేస్తోంది. కేవలం జాకెట్లు, లంగాలు కుట్టడంకాక, మగవాళ్ళ పేంట్లు, బుష్ షర్టులు, కోట్లు కుట్టడం శాస్త్రీయంగా నేరుస్తోంది. మిషన్లు విప్పి బాగుచేయడం నేర్చుకుంటుంది."

"దీనివల్ల ఈ పల్లెటూళ్ళో ఏం పని దొరుకుతుంది?"

"అవసరం అయితే పట్నవాసానికి చేరుతుంది విద్య నేర్వడంలో తప్పు లేదుగా? మన బ్లాకు వాళ్ళు మిషన్ సెంటర్ పెట్టి టీచరుని వేశారు. అంతా నేరుస్తున్నారు. ఇప్పుడు మిషనులేని యిళ్ళు లేవు! ఆ మిషన్లు పాడయితే పని దొరుకుతుంది."

"చాలా మంది కేవలం జాకెట్లు కుట్టడం వరకే నేరుస్తున్నారు అధికశాతం మిషన్లు గొప్పకోసం కొనేసి యిళ్ళలో అడ్డంగ పెట్టుకుంటున్నారు! ఆ మిషన్లు పాడవ్వ!"

"చిన్నపిల్లలకి రంగు రంగుల గుడ్డలతో అందంగ రెడీమేడ్ గుడ్డలు కుడితే, పల్లెల్లో మాత్రం డిమాండ్ లేదూ?"

"ఆ మాత్రం ధైర్యం ఉంది, ఫర్వాలేదు!"

"ధైర్యం కాదిది ఆత్మ విశ్వాసం. రెండు పనులు చేయకపోతే, ఎక్కడయినసరే, సగౌరవంగ బతికేయవచ్చన్న నమ్మకం అంతే!"

"మరి, మీ వివాహాల గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"చేసుకోవాలనే అవకాశం వస్తే."

"అవకాశం వస్తే అంటే?"

"మా అమ్మాయి పెళ్ళికి వుంది- మీ అబ్బాయికి చేసుకోండి — అంటూ నాన్నని తిప్పడం ఈ పరిస్థితిలో నాకిష్టంలేదు. పెళ్ళి అనేది స్త్రీ పురుషులు పరస్పరాకర్షణ, అవసరం అన్న ప్రాతిపదిక మీద ఆధారపడి, కలిపి జీవించడం. దానికి అటు యిటూ, పెద్దవాళ్ళ ప్రమేయం ఎంత తక్కువగ వుంటే అంత మంచిది. ఆకాశం అంత పందిరి, ఏటిగట్టంత పెళ్ళిపీట అక్కర్లేదు. కావలసింది ఒకరిపట్ల ఒకరికి నిష్కల్మషమైన అనురాగం—అంతే!"


"కబుర్లు చెప్పినంత సుళువు కాదు, అవకాశం రావడం!"

"అదే వస్తుంది — ఆడపిల్లలందరూ యిలా ఆలోచించి, ఆచరించగలిగితే — మగవాళ్ళు— తనకి నచ్చిన కన్యని తప్పక కోరుకుని, స్వీకరిస్తాడని నా నమ్మకం!"

సంభాషణ డొంకతిరుగుడుగ నడుస్తోందని గ్రహించారు పరంధామయ్య, కిష్టప్ప తల్లీను. కిష్టప్ప తల్లి అంది.

"ఎందుకీ ముసుగులో గుద్దులాట? ఒరేకృష్ణా! నువ్వు సుజాత పెళ్ళి చేసుకుని, ఒక యింటి వాళ్ళవడం, మావయ్య నేను కోరుకుంటున్నది. ఆ విషయం మాట్లాడండి."

అనుకోని యీ దారి మళ్ళింపుకి, సుజాత, కిష్టప్ప మౌనంగ ఉండిపోయారు.



# మమత

అయిదు నిముషాల యాక, కిష్టప్ప అన్నాడు.

"ఇష్టాయిష్టాల ప్రసక్తే అయినట్టయితే నా కభ్యంతరంలేదు!"

"ఇష్టం ఒకటే కాదు చూడవలసింది! మనకిష్టం అయినవన్నీ ఆచరించనూలేం!"

"మనం పెళ్ళాడి సంసారం సాగించడం ఆచరణీయం కాదంటావా?"

"కాదనలేను. కాని, కొన్ని సందేహాలు!"

"ఏవిటవి?"

"నువ్వు ఆ పల్లెటూళ్ళో ఎలా బ్రతుకుతున్నావో నాకు తెలీని విషయం. ఉద్యోగం కోసం, నువ్వు చేస్తున్న కృషి ఏవిటో నాకు అంతుపట్టని విషయం?"

"అదా? నీ సందేహం? నేనుమెట్రిక్కు చదివే కుర్రవాళ్ళకి లెక్కలు, ఇంగ్లీషు, హిస్టరీ చెప్పగలను. ఓ పదిమంది స్టూడెంట్స్ వుంటే, మూడు వందలు వస్తాయి."

"ఇలా విడుగూ బొడుగూ లేని వ్యాపకాలతో ఎంతకాలం? గోపాలరాజుద్వారా కృషి చేస్తే, కాస్త మంచి ఉద్యోగం శాశ్వతంగా దొరుకుతుంది కదా?"

"ఆ పేరెత్తకు! నా పేరు చెబితే చిల్లిగవ్వంత ఉపకారం జరగదు. గ్రామ నౌకరు ఉద్యోగానికి కూడ, ఓ రాజకీయనేతని పట్టుకుంటేనేగాని పని జరగదు అని మన వరాల్లోకి ఎక్కించారు. దేశానికి స్వతంత్రం వచ్చాక, ఇన్ని ముప్ఫయి సంవత్సరాల్లోనూ యువతరానికి మనం అందించిన సందేశం యిది. ఎంత చదివిన వాడికయినా స్వయం కృషి మీద, స్వయం ప్రతిభ మీద. ఉద్యోగం వస్తుందన్న ఆత్మ విశ్వాసాన్ని కలిగించలేక పోయాం. నేను ఉద్యోగం కోసం వీళ్ళని దేవిరిస్తానన్నది కలలో మాట!"

"నీ ప్రతిభ మీద నీకు ఉద్యోగం వస్తుందా?"

"రాదు! నా ప్రతిభ, నా సిన్సియారిటీ చాలదు వీళ్ళకి. నా కులం, జిల్లా, పార్టీ కూడా కావాలి. కబుర్లలో దొర్లించే సమత, సర్వ సమానత్వం వాళ్ళ హృదయాలకి లేదు."

కిష్టప్ప తల్లి తిరిగి కలగజేసుకుంది.

"వీళ్ళు ఒకట్రెండ్లే సరిగ సంసారం చేస్తారా అని?"

ఎవరినీ ఉద్దేశించని ఆ ప్రశ్నకి, పరంధామయ్య జవాబు చెప్పాడు.

"ఈ తరంవాళ్ళ వాళ్ళు. అన్నీ తెలుసుకుంటున్నారు. మాట్లాడుకుంటున్నారు. మాట్లాడుకుని నిర్ణయించుకుంటే బాధలు ఉండవు కదా?"

"వీళ్ళకి ఏ బాధలూ రావంటావా?"

"వచ్చినా మనకన్న సవ్యంగా చక్కబెట్టుకోగలరు!"

పరంధామయ్య మాటలు అందరికీ నచ్చాయి. సుజాతకి ధైర్యాన్ని, ఉత్సాహాన్ని యిచ్చాయి.

కిష్టప్ప—తల్లీ వెళ్ళిపోయారు. సుజాత తన వివాహం గురించి ఎట్లా తేల్చుకోలేకపోయింది.

* * *

ప్రమీలకి, కుట్టుమిషన్ కంపెనీ నుంచి ఆఫరొచ్చింది, సేల్స్ రిప్రజెంటేటివ్‌గ పని చేయడానికి. విశాఖపట్నంలోని ఉషా షో రూంలో హాజరు కావాలి. ఇంటింటికీ వెళ్ళి, కుట్టుమిషన్ల, అర్డర్లు సంపాదించాలి. అమ్మకం అయిన మిషన్లు గ్యారంటీ పీరియడ్‌లో పాడయితే బాగు చేయాలి. జీతం కాక, ఆర్డర్ల మీద కొంత కమీషను, తిరిగి రావడానికి కొంత బేటా అన్నీ నాలుగు వందలు పైన గిడతాయి.

ఆరోజు సాయంకాలం, కూతుళ్ళిద్దరినీ సరసన కూర్చోబెట్టుకుని, ప్రమీల గురించి మాట్లాడుతున్నాడు.

"నువ్వేం చేయకలవమ్మా యీ నౌకరీ? ఆర్డర్లు సంపాదించడం మాటలా? ఆ తరువాత రిపేర్లు చూడాలి... పోనిద్దూ మరో నౌకరీ చూసుకోవచ్చు!"

"అలా అనకు నాన్నా! నా కాళ్ళ మీద నేను నిలబడాలిగా? అక్కయ్య మీద ఎంత కాలం? తనూ పెళ్ళి చేసుకోవాలిగా? నా గురించి తను పెళ్ళికి సిద్ధపడ్డం లేదని పిస్తోంది!"

"ఛా! అదేంకాదు! ప్రమీలా! ఆ విషయం దేనికిప్పుడు? నీకు చేయగలనన్న ధైర్యం వుందా?"

"ఆ! నిక్షేపంలా చేయగలను. అదేమంత కష్టమైన పని కాదు! నాకొచ్చిన ఎంబ్రాయిడరీ నేర్పడానికి క్లాసెస్ పెడితే, ఆ విధంగ గడించగలను. నన్ను వెళ్ళనీయండి!"

"అక్కడ ఎలా వుంటావమ్మా? అన్నీ ఆలోచించుకోవాలిగా?"


"అదేవిటి నాన్నా! ప్రమీల ఒక్కతే వెళ్ళదు! మీరు కూడా వుంటారు!"

"మరి, నువ్వు వొంటరిగా వుండగలవా?" ప్రమీల అడిగింది.

"అబ్బే ఇవేం కుదిరేవి కావమ్మా?" అనేశాడు పరంధామయ్య.

ఆ మాట యిద్దరు కూతుళ్ళకీ నచ్చలేదు.

[36వ పేజీ చూడండి]






# మ మ త

(16 వ పేజీ తరువాయి)

సుజాత అంది: "ఉన్న ఊళ్లో నాకేం భయం? పైచోట నీకు నాన్న సహాయం కావాలి! మీ ఇద్దరూ రేపే బయల్దేరండి!"

ప్రమీలకి హుషారొచ్చింది. సుజాత నిబ్బరంగానే వుంది. పరంధామయ్య పరాగ్గా యింకా ఏదో ఆలోచిస్తూనే వున్నాడు.

కూతుళ్లు యిద్దరూ ఒకటయ్యారు. స్వయంగ బ్రతకడానికి పాకులాడుతున్నారు. తనెందుకిలా కృంగదీస్తున్నాడు వాళ్ల ఉత్సాహాన్ని? అనుకొని "సరేనమ్మా! కానియ్యండి! ఎప్పటికేది జరగాల్సి వుంటే అదలా జరుగుతుంది. ప్రయాణం ఏర్పాటు చూడండి!"

తండ్రి ఆ మాట అనగానే, సుజాత, ప్రమీలల మనస్సులు తేలిక పడ్డాయి.

"మాటల్లో పడితే టైము కూడా తెలియదు చంద్రుడెంత పైకి వచ్చాడో? లేవండి భోజనాలు చేద్దాం!" అంటూ పరంధామయ్య కాలవ రేవులోకి నడిచాడు. సుజాత, ప్రమీల కొంగులు నడుంకు బిగించి, వంటింటివైపు కదిలారు.

## 3

మనిషిని ఒంటరితనం ఎంత బాధిస్తుందో సుజాతకి అనుభవంలోకి వచ్చింది. తోడు కోసం మనసు విలవిల్లాడుతూంది. చుట్టూ ప్రశాంత వాతావరణం. తన వూపిరి తనకే వినబడేంత నిశ్శబ్దం. ఇంటికి రాగానే తండ్రి కబుర్లు; ప్రమీల తోడు వుండేవి. అవి కరవయిన కొత్త అనుభవం.

నిర్మలాకాశం నీలంగ మెరుస్తూంది చంద్రకాంతికి కాలవలో నీరు నిర్మలంగ ప్రవహిస్తూంది. పడమర గాలి పైట నెగరకొడుతూ వీస్తూంది. ఈ దృశ్యాన్ని, ఈ గాలినీ భరిస్తూ ఎంతకాలం గడపడం? ఈ కాలవ కూడా ఏడాదికోమారు, ప్రవాహాన్ని కాదని, ఓ నెల విశ్రాంతి తీసుకుంటుంది! వసంతాలు దొర్లుతున్నా తనకేదీ విశ్రాంతి? మార్పు?

తాను కోరుకుంటున్నమార్పేవిటి? వివాహ జీవితమేనా? మరి కిష్టప్పనెందుకు జీవితంలోకి ఆహ్వానించలేక పోతూంది? కిష్టప్పలో ఏదో వెలితి తనకి కనిపిస్తూంది! అది అతను నిరుద్యోగి కావడమా? అతను ఏ గుమాస్తాగానో ఎక్కడో పని చేస్తూంటే, తానిష్టపడేనా? అతను గుమాస్తాగిరీ యీ పల్లెలో కుదరక. దూరంగ వుంటే తనూ అతనూ కలిసి వుండేది ఎప్పుడు? తనూ అతనితోపాటు పట్నంలో ఉద్యోగం చేస్తూ గడపవచ్చుగా? ఆ జీవితం ఎలా వుంటుంది?

ఈ కాలవ, తన మెదడు ఒక్కటే! ఆ ప్రవాహం యీ ఆలోచనా ప్రవంతి ఆగడం ఉండదు!

తెగూ తెంపూలేని ఆలోచనలు మెదడును మొద్దుబరుస్తాయి. మెదడు మొద్దుబారేక, యింక పని చెయ్యదు, మత్తులో పడుతుంది. ఆ దశలో శరీరానికి చల్లగాలి సోకితే నిద్ర తెలియకుండ వస్తుంది

సుజాత నిద్రపోయింది- కాలవమాత్రం పారుతూనే వుంది.

## 4

"అదేనిటే! ప్రమీలా అలా చిక్కిపోయావు?" లోపలికి వస్తూనే అడిగింది, సుజాత సామాను లోపల పెట్టించి, రిక్షా మనిషిని పంపించి వచ్చింది ప్రమీల.

"నా మాట అలా వుంచు! నాన్న యీ మధ్య నీ గురించి ఒకటే కలవరింతలు! రాత్రిళ్లు నిద్ర కూడా పోవడంలేదు. భయంవేసి ఓ కార్డు వ్రాసి పడేశా! నువ్వొచ్చావు, నాకు కొండంత ధైర్యం వచ్చింది!"

"నీకు తిరగడం ఉద్యోగం పడనట్టుంది. బాగా చిక్కిపోయావు!"

"నువ్వు మహా లావుగ వున్నట్లు ఆ కళ్లలో కాంతి లేదు! పొడారిపోయిన కళ్లూ నువ్వూను!"

"ఎడారిలో జీవిస్తున్నా కదూ? అందుకు!"

"హాస్యంకాదు. నాన్న నీ గురించి ఎంత ఆలోచిస్తున్నారని? వచ్చే వేళయింది! అలా బీచ్‌కి వెళ్లారు నువ్వు లేచి తెములు, స్నానం చెయ్యి!" అంటూ తను బాత్‌రూమ్ వైపు నడిచింది.

సుజాత ఆ కాస్త చిన్న గదిని, ప్రమీల ఎంత అందంగ సర్దిందీ గమనించింది.

ఇద్దరూ పోటీపడినట్టు ముస్తాబుఅయి వీధి గేటు దగ్గర నిలబడ్డారు. పరంధామయ్య వస్తూనే సుజాతను చూసి పొంగిపోయాడు.

"బాగున్నారా? నాన్నా ?"

"నా బాగుకేం? నువ్వెలా వుంటున్నావు? అలా పొడుగెదిగి పోయావేం?"

"పొడుగెదగడం కాదు! చిక్కింది. పైగా నన్ను ఆక్షేపిస్తోంది"

"రండి లోపలికి! అమ్మా ప్రమీలా! నా వాలు కుర్చీ బయట పడెయ్య తల్లీ! నా పక్కన చాపమీద కూర్చోండి! ఇలా కబుర్లు చెప్పుకుని ఎన్నాళ్లయిందో?"

తండ్రి, ప్రమీల కబుర్లు వింటూ, అలా కళ్ళప్పగించి చూస్తూ కూర్చుంది సుజాత బుద్ధిమంతురాల్లా!

*　　*　　*

"ప్రమీలా! నిన్నోమాట అడగాలి! ఆ ఎదురింటి వాటాలో వుంటున్న వాళ్లెవరే? ఆవిడ డ్యూటీకి వెడుతుంది. అతనెప్పుడూ డ్యూటీకి వెడుతున్నట్టు కనబడదు! ఎవరు వాళ్లు ?"

"ఏం? వాళ్లమీద పడింది నీ దృష్టి ? నువ్వేమనుకుంటున్నావు వాళ గురించి?"

"అబ్బే! మరేం కాదు! వాళ్లది ఆదర్శ దాంపత్యం అనిపిస్తోంది. ఒకే కొడుకు ఆమె ఆఫీసుకి వెడుతుంది. అతను కొడుకుని స్కూలుకు దింపి, మధ్యాహ్నం వస్తాడు. సాయంత్రం ఆమెరాగానే, అందంగ తయారయి ముగ్గురూ బయటికి వెడతారు. ఎప్పుడూ నవ్వుతూ వుంటారు! వాళ్ళకి సమస్యలు, చికాకులు ఏమీ లేవేమో అనిపిస్తుంది! నాకు నచ్చారు! వాళ్లెవరు ?"

"విను! ఆమె చెల్లమ్మ అని మళయాళీ. చాలా మంచిది. ఆమె ద్వారా అరడజను ఆర్డర్లు సంపాదించా. నాకు బాగా తెలుసు. ఇక్కడ ఓ ప్రయివేటు కంపెనీలో పని చేస్తోంది. ఏడెనిమిది వందలు తెచ్చుకుంటూంది. కులానికి నాయరా బ్రాహ్మణులు వాళ్ళు. ఇక్కడ వున్న మళయాళ బ్రహ్మచారులను పెళ్లి కోసం ప్రయత్నించింది. కుదిరింది కాదు. ఓ సారి యింటికి వెళ్ళినప్పుడు అతన్ని పెళ్లాడి, తీసుకు వచ్చింది. అతను మెట్రిక్యులేటు. ఒంటి గంట దాకా, బజారులో పెద్ద శలూన్‌లో పని చేస్తాడు. సాయంత్రం పెళ్లాం పిల్లల్ని తీసుకుని షికారుకి వెడతాడు !"

నమ్మలేనట్లు అలా వుండిపోయింది, సుజాత మాటా మంతీ లేకుండా !


*　　*　　*

ఇంటికి తిరిగివచ్చిన వెంటనే కిష్టప్పకో లేఖ వ్రాసింది సుజాత.

లేఖ అందుకుని కిష్టప్ప వచ్చాడు.

"బావా ! మనం పెళ్లి చేసుకుందాం !" అని మాత్రం అనగలిగింది- మరింక మాటలు రాక తన గుండెలోని మనుతవి బావ గుండెకు వినిపింప జేసింది.

బయట కాలవలో రెండు పడవలు జంటగ వెడుతున్నాయి. ఆ జంటను తనలో చూసుకుని, తన జన్మ ధన్యమయినట్లు పులకించి పోయింది, కాలవ !




ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విమల్ వస్త్రములకు
శ్రీ ఆర్సీ టెక్స్
విమల్ షోరూము

అన్నిరకముల మిల్లుల వస్త్రములు, పట్టుచీరలకు
శ్రీ గీతా టెక్స్‌టైల్సు
గ్రూప్ ఆఫ్ మిల్సు షోరూము

చౌదరి బిల్డింగ్, జిన్నాటవరు సెంటరు, మెయిన్‌రోడ్డు. గుంటూరు
ఫోన్ నెం : 23905